దీక్ష సాక్షి

తెలుగు దినపత్రిక

నిజం కోసం... ప్రజల కోసం...

R.I. No. TELTEL/2023/87656

సంపుటి : 2 : సంచిక : 5 | 27-9-2026 | ఆదివారం | పేజీలు : 4 : వెల : రూ.1/-

Published From హైదరాబాద్ తిరుపతి, కడప, అన్నమయ్య

ప్రజల భద్రతే పోలీసుల తొలి ప్రాధాన్యం

- మహిళలు, బాలికల రక్షణపై ఎస్పీ సుబ్బరాయుడు ప్రత్యేక దృష్టి
- బాల్య వివాహాల నివారణ.. సైబర్ నేరాల కట్టడికి విస్తృత అవగాహన
- దయల్--112, శక్తి యాప్ సేవలపై ప్రజలకు అవగాహన.



రేణిగుంట, సెప్టెంబరు 28, దీక్ష సాక్షి ప్రత్యేక ప్రతినిధి.
ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు చేపడుతున్న చర్యలు జిల్లాలో పోలీసింగ్‌ను మరింత ప్రజానుకూల రూపాన్ని తీసుకొస్తున్నాయి. ముఖ్యంగా మహిళలు, బాలికల భద్రత, బాల్య వివాహాల నివారణ, సైబర్ నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ వంటి అంశాలపై ఎస్పీ ప్రత్యేక దృష్టి సారిస్తూ పోలీసు అధికారులను ప్రజల్లోకి వెళ్లి అవగాహన కల్పించేలా ఆదేశిస్తున్నారు.ఎస్పీ ఆదేశాల మేరకు రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని గ్రామాలు, ఆర్టీసీ బస్టాండ్లు, బస్సు షెల్టర్లు, రద్దీ ప్రాంతాలు, ప్రజలు అధికంగా సంచరించే ప్రదేశాల్లో పోలీసులు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నేరం జరిగిన అనంతరం స్పందించడానికే పరిమితం కాకుండా.. నేరాలు జరగకుండా ముందుగానే ప్రజలను అప్రమత్తం చేయడం, ప్రమాదాలను నివారించే విధంగా సూచనలు చేయడం, అనుమానాస్పద పరిణామాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించేలా ప్రజలను చైతన్యపరచడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశంగా అధికారులు తెలియజేశారు.

బస్టాండులో ప్రయాణికులకు అవగాహన

శనివారం రేణిగుంట ఆర్టీసీ బస్టాండులో శక్తి--6 సిబ్బంది ప్రయాణికులతో నేరుగా మాట్లాడి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రయాణ సమయంలో విలువైన వస్తువులు, నగదు, మొబైల్ ఫోన్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమ చుట్టూ అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ప్రయాణికులు తమ సామగ్రిని జాగ్రత్తగా చూసుకోవాలని, తెలియని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ప్రజల అప్రమత్తతతోనే అనేక నేరాలను ముందుగానే అడ్డుకోవచ్చని అధికారులు వివరించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులను తెరవడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, ఓటీపీ తదితర కీలక సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు తెలియజేయవద్దని స్పష్టం చేశారు.సైబర్ నేరగాళ్లు వివిధ రకాల మోసపూరిత పద్ధతులను ఉపయోగించే అవకాశం ఉన్నందున అప్రమత్తతే ప్రధాన రక్షణ అని పోలీసులు ప్రజలకు వివరించారు. అనుమానాస్పద లావాదేవీలు లేదా మోసానికి సంబంధించిన పరిస్థితులు ఎదురైతే ఆలస్యం చేయకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు.

మహిళలు, బాలికల భద్రతకు ప్రాధాన్యం

మహిళలు, బాలికల భద్రతను జిల్లా పోలీసు యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతతో చూస్తుందని అధికారులు తెలిపారు. మహిళలు, బాలికలకు ఇబ్బంది కలిగించే పరిస్థితులు ఎదురైనప్పుడు మౌనంగా ఉండకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై తల్లిదండ్రులు, యువత, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. బాలికల విద్య, భద్రత, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బాల్య వివాహాలను నిరోధించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు కోరుతున్నారు.

అత్యవసర సమయంలో డయల్--112 ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం వేగంగా అందించేందుకు డయల్--112 సేవ అందుబాటులో ఉందని పోలీసులు వివరించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ఆలస్యం చేయకుండా ఈ సేవను వినియోగించుకోవాలని సూచించారు.మహిళల భద్రతకు సంబంధించి శక్తి యాప్ సేవలను కూడా వినియోగించుకోవాలని మహిళలు, బాలికలకు అవగాహన కల్పించారు. అవసరమైన సమయంలో సాంకేతిక సేవలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా తమ భద్రతను మరింత మెరుగుపరుచుకోవచ్చని పోలీసులు తెలిపారు.

రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. వాహనదారులు, ప్రయాణికులు రోడ్డు భద్రతా నిబంధనలను పాటిస్తూ అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలపై దృష్టి
పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు. ఎన్నికల సమయంలో వివాదాలు, ఘర్షణలకు దారితీసే చర్యలకు దూరంగా ఉండాలని కోరారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు ప్రజలు పోలీసు యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజలతో మమేకమై.. ముందస్తు చర్యలే లక్ష్యంగా
జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ సీఐ మంజునాథ్ రెడ్డి, అర్బన్ సీఐ జయచంద్ర తమ సిబ్బందితో కలిసి ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం, నేరాలపై ముందస్తు అవగాహన కల్పించడం, అనుమానాస్పద కార్యకలాపాలపై అప్రమత్తం చేయడం వంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నారు.ప్రజల భద్రతకు సంబంధించి పోలీసుల సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఎలాంటి సమస్య ఎదురైనా పోలీసులను సంప్రదించడానికి వెనుకాడాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు పోలీసులకు సహకరిస్తే నేరాలను మరింత సమర్థవంతంగానియంత్రించవచ్చని తెలిపారు.ప్రజల సహకారంతోనే నేరరహిత, సురక్షిత సమాజ నిర్మాణం సాధ్యమని పోలీసులు స్పష్టం చేశారు.రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో అటు రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ జయచంద్ర, ఇటు రూరల్ పరిధిలో సీఐ మంజునాథ్ రెడ్డి శాంతి భద్రతలు కాపాడడంలో నిరంతరం విధి నిర్వహణ చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

రౌడీ షీటర్ అరెస్ట్.... శనివారం రేణిగుంట అర్బన్ పోలీసులు ఇబ్రహీం అనే రౌడీషీటర్ గొడవకు పాల్పడటంతో అతడిని అరెస్ట్ చేసి రేణిగుంట తాహసిల్దార్ మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ శ్రావణ్ కుమార్ ముందు హాజరు పరుపగా అయన నిందితునికి 14 రోజుల జుడీషియల్ కస్టడీకి పంపారు.

నిందితులను రిమాండ్ కు పంపిన గాజులమండ్యం పోలీసులు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మంజునాథ రెడ్డి , ఎస్సై హరీష్ తమ సిబ్బందితో దారి దోపిడీకి పాల్పడిన అజయ్ కుమార్ అలియాస్ స్వామి, తిరుపాల్ అలియాస్ గెలుగు రవి, సుందర మోహన్ సాయి లను అరెస్టు చేసి వారి వద్ద రెండు ఆటోలు, ఒక మొబైల్ ఫోను, స్వాధీనం చేసుకొని రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు సమక్షంలో విలేకరుల సమావేశం నిర్వహించి ముద్దాయిలను రిమాండ్కు పంపారు.

మల్లెంగుంటలో ఆపరేషన్ త్రిశూల్... గాజులమండ్యం పోలీసులు మల్లెంగుంటగ్రామంలో ఆపరేషన్ త్రిశూల్ లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు.

పాత రేణిగుంటలో ఆపరేషన్ త్రిశూల్.. అర్బన్ సీఐ జయచంద్ర తమ సిబ్బందితో కలిసి పాత రేణిగుంట గ్రామంలో ఆపరేషన్ త్రిశూల్ కార్యక్రమం ద్వారా ప్రజలకు తమ స్వీయ రక్షణ పై అవగాహన కల్పించారు.